


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**78**

**(21 ' అక్టోబరు 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**పండగ సంబరాలు** అనేకవిధాలుగా ఉంటాయి. నిజానికి ఎవరి సంబరం వారిది. పూర్వం పండుగలూ సంబరాలు కుటుంబానికంతకూ చెందినవిగా ఉండేవి. ఈ కాలంలో ఎవరి సంబరాలు వారివే.

కొందరికి సినిమా సంబరం, కొందరికి పొరుగింటి పెత్తనం సంబరం, కొందరికి పిండివంటల సంబరం, కొందరికి గుర్రుకొట్టి నిద్రపోవడం సంబరం, ఇలా రకరకాల సంబరాలు ఏర్పడినాయి.

కనుక పండుగనాడు ఒకచోట చేరి పదిమందీ సంతోషంగా కబుర్లు చెప్పుకోవడం, నవ్వుకోవడం, ఒక్క పంక్తిని కూర్చుని విందులారగించడం, తాంబూలం సేవిస్తూ శ్రుతి చేసిన తంబురాలలాగా చక్కని స్వరాలతో అన్యోన్యతలను ప్రదర్శించుకోవడంలన్నీ మృగ్యమైనాయి. ఎవరికి వారే.

షికారు వెళ్ళిన వాళ్ళు భోజనం ఒకసారి అయితే, సినిమాకి వెళ్ళినవాళ్ళు భోజనం మరోసారి, క్రికెట్‌కి వెళ్ళినవారి భోజనం ఒకసారి అయితే, పేకాటలో మునిగిన వారి భోజనం మరోసారి. నిజమే. ఎవరికి ఆనందం కల్పించే పరిస్థితి వారికి పండుగ.

మొన్న పండుగనాడు మా బంధువుల్లో ఒక అబ్బాయి సంబరం ఎంతో విచిత్రంగా జరిగింది. అతడు మంచి హాస్య ప్రవృత్తిగలవాడు. విచారంలో నవ్వగలడు. నాట్యం చెయ్యగలడు. బుర్ర వేడెక్కిపోతున్నప్పుడు బుర్రకథ కూడా చెప్పగలడు.

ఈ కళలన్నిటినీ ఒక్కమాటుగా ప్రదర్శించే అవకాశం ఆయనగారికి మొన్న సరస్వతీపూజనాడు లభించింది. అతగాడే తనలో నవ్వుకుంటూ ఉండటంవల్ల మేమందరం విచారపడుతూనే వినోదం అనుభవించడం జరిగింది. చివరికి అది సరదాగానే మారింది గనుక సరిపోయింది. ఇంతకీ జరిగిన తమాషా ఏమిటంటే అతగాడు ఉద్యోగంలో ప్రవేశించి, పదిరాళ్ళు వెనకేసుకుని - ఒక సైకిల్ కొనుక్కున్నాడు. అలా కొనుక్కోవడంవల్ల ఆ సైకిల్ ఏ కంపెనీదో కూడా మరిచిపోయి దానికి కష్టార్జితపు సైకిల్ అని పేరు పెట్టాడు.

అంతకుముందు కాలేజీలో చదివే రోజుల్లో వాళ్ళ నాన్నగారు సైకిల్ కొనిపెట్టారట. దాన్ని పిత్రార్జితపు సైకిల్స్ అని పిలిచేవాడట. దాన్ని తమ్ముళ్ళకు వదిలి కష్టార్జితపు సైకిల్‌మీద హైదరాబాద్ వీధుల్లో "చలో చలో సైకిల్" అంటూ ఎంతో హుషారుగా తిరగడం అలవాటు చేసుకున్నాడు.

"ఎవరైనా ఎదురైతే దిగి 'ఏమంటారు. నా సైకిల్ బాగుందంటారా? ఇది కష్టార్జితపు సైకిల్. స్వంతం అవడం వల్ల ఇంత హాయిగా వుంది. దీనిమీద వెడుతుంటే వేడిగాలి కూడా చల్లబడుతుంది. మనస్సుల్లో పిల్లన గ్రోవి వినిపిస్తుంది" అని చెప్పి ఎంతో ఆనందించేవాడు.

నిజానికి ఆయనగారు సైకిల్ మీద వెడుతున్నట్లు భావించేవాడుకాడు. పెళ్ళి కుమారుడు మల్లెపూల దండలు మెడనిండా వేసుకొని తెల్లగుర్రం మీద కళ్యాణమంటపానికి వెడుతున్నట్లుండేవాడు. ఎవరూ ఎదురురాకపోతే నోరులేని ఆ సైకిల్‌తోనే ఏవో సరసాలాడుతూ వుండేవాడు. సంతోషం పట్టలేక ఒకప్పుడు బ్రేకులు నొక్కి బెల్ కొడుతూ బాలెన్స్ చేసుకుంటూ, నవ్వుకుంటూ ఉండేవాడు.

అలాటి సైకిల్‌ని ఆయనగారు సరస్వతీ పూజరోజున ఒక మిత్రునికి అప్పగించాడు. సరదాగా తిరిగి వస్తాడు. తిరిగొచ్చి తన వాహనాన్ని గురించి ఎంతో ప్రస్తుతిస్తాడు - అదే ఆనందంలో. రాత్రి ఎనిమిదైయింది. మిత్రుడు రాలేదు. మా సైకిల్ నాథుని మనస్సు కొంచెం వ్యాకులమైంది. ఇంతలో ఆయనగారికి ఫోన్ కాల్ వచ్చింది. వింటున్నాడు. ముఖంలో అయిదారు రంగులు మారాయి. గొంతుకలో ఎన్నో కూతలు - కొన్ని భయంకరమైనవి, కొన్ని ఆశ్చర్యకరమైనవి వినిపించినాయి. చివరకు చెయ్యి నుదురు మీదకు పోయింది వెంటనే 'అబ్బా' అని కేకవినిపించింది.

తర్వాత అడగ్గా అడగ్గా చెప్పాడు. మిత్రుడు వేసుకు వెళ్ళిన సైకిల్ పోలీస్ స్టేషనులో ఉన్నదనీ, అది దొంగసైకిల్ అని పట్టుకున్నారని. తన కష్టార్జితపు సైకిల్‌కి ఇంత ప్రమాదమా! పైగా పోలీసులు వచ్చి రుజువు చేసుకొమ్మన్నారట.

ఎలా? కొన్న రసీదు కోసం వెతకాలి? ఎక్కడుందో. కంపెనీ గుర్తు మాత్రం గుర్తుందా! కష్టార్జితపు సైకిల్ అనేదాన్ని పిలిచేది. చెమటోడ్చి కొన్న సైకిల్. ఆ చెమట మాత్రం ఎక్కడ వుంది. ఎప్పటికప్పుడు జేబురుమాల్‌కే అంకితమైంది. ఇలాంటి క్లిష్టపరిస్థితులు వస్తాయని ఏం తెలుసు? లేకపోతే సీసాల్లో పట్టి కాగితం అంటించి జాగ్రత్తగా దాచేవాడు. సైకిల్ పట్టుకున్నారని తెలియగానే ముచ్చెమటలు పట్టాయనుకోండి. వీటివల్ల ప్రయోజనం ఏం వుంటుంది?

తన సైకిల్ గదిలో పకపకలాడుతూ కనిపించే సైకిల్. రంగు మాయని సైకిల్. అసలా గంట ఎలాటిది? వీణలాగా వినిపిస్తుంది సీటు. సీటు కాదది చక్కని సీటు చక్రవర్తుల సింహాసనం దీని ముందు ఎందుకు పనికివస్తుంది? అలాంటి సైకిల్ పోలీస్ స్టేషనులో పడివుందా? అవును మహాపతివ్రత సీతాదేవికే తప్పలేదు. ఇలాంటి అగ్నిపరీక్ష.

"ఆవిడ ఆచూకీ చాలాకాలంవరకూ తెలియలేదు. నా సైకిల్ ఆచూకీ అరక్షణంలో తెలిసింది కనుక హనుమంతుడితో పనిలేదు. నేను హూటాహుటిని వెళ్ళగలను. వెంట లక్ష్మణుడుంటే చాలు" అంటూ ఆయనగారు బయలుదేరారు పోలీసు స్టేషనుకి.

ఎంత ధైర్యం సాహసాలు కల వ్యక్తి అయినా కొంచెం విచారం వుంటుందిగా! అందుకని ఆయనగారు ఒక కాలికి బూటు తొడుక్కుని, రెండోకాలు మాట మరచిపోయి

"పోయెనయె ఇపుడు నా సైకిల్.. ఆ పోవునపుడు ఆ బండి వయ్యారము ఆ మిత్రుని పరితాపము..

పరితాపము కాదది నా పాపము..

పోయెనయె ఇపుడు నా సైకిల్." - అనుకుంటు వెళ్ళిపోతుంటే పిలిచి రెండో బూటుమాట జ్ఞాపకం చేశాం. ఆయనగారు ఉన్న బూటు కూడా విప్పబోయి చటుక్కున ఆపి రెండోది కూడా తొడుక్కుంటూ ఈ మాత్రం దర్జాతో వెళ్ళకపోతే సైకిల్ నాదని ఎలా నమ్ముతారు? పాదచారిగా వెళ్ళే సమయంకాదు అంటూ వెళ్ళారు.

వెళ్ళి సైకిల్‌పై తనకుగల అనురాగాన్ని వర్ణించారట చాలాకాలం. "అనురాగం మమకారం ఎవరక్కావాలయ్యా!?" గుర్తులు చెప్పవయ్యా అన్నారుట అక్కడివారు.

"గుర్తు చెప్పాలా! పోయిన వాడిముఖం గుర్తుపట్టలేదా మీరు. అది తేలిక కాదుటయ్యా. మీకు అంతగా నమ్మకం లేకపోతే కుక్కని పిలవండి. వాసన పడుతుందేమో చూద్దాం" అని ఆయనగారు ఠీవిగా నిలబడ్డారట. ఎంత చెప్పినా "రేపు మీరు సైకిల్ కొన్న బిల్లు తీసుకురండి ఇస్తాం" అన్నారట. ఆయన విచారంతో యింటికి వచ్చారు.

ఆ రాత్రంతా సైకిల్ కలవరింతలు దానిమీద బుర్రకథ.

"మిత్రుడికిచ్చిన సైకిల్ గతి ఏమైందయ్యా? ఎదురుగా వచ్చారు.. పోలీసువారు (కంఠం మార్చి) సైకిల్ గట్టిగా పట్టుకున్నారు. (దీర్ఘం తీస్తూ) పట్టుకుని స్టేషనులో పెట్టినారయ్యో.. తందానతాన" - అంటున్నారు రాత్రి రెండుగంటలవేళ.

ఎలాగో తెల్లారింది. సైకిల్ వచ్చింది యింటికి. ఆయన సంబరం చూడాలి. పండగ సంబరం అంత గొప్ప సంబరం ఎవరూ అనుభవించి ఉండరు.

Post your comments